క్లుప్తంగా

ఆకట్టుకునేలా విద్యా బోధన



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఎంఈఓ-2 చంద్రమౌళి

ఎల్.ఎన్.పేట: విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన ఉండాలని ఎంఈఓ-2 చంద్రమౌళి అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన చేయాలన్నారు. విద్యార్థులకు పాఠాలను బోధించారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉండాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం ఎం.కె.మిశ్రో, ఉపాధ్యాయుడు టి.ఉపేంద్ర ఉన్నారు.

15న పూర్వ విద్యార్థుల సమావేశం

సరుబుజ్జిలి: మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 15న పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. చదువు పూర్తిచేసుకొని వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా హాజరుకావాలని కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్.ఎన్.పేట: తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ పైడి లతశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ వరి చేను కోతలు, యంత్రాల ద్వారా నూర్పుడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కోత కోసిన చేను కుప్పలు పెట్టి టార్పాలిన్లు కప్పాలన్నారు. ధాన్యం కూడా తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అపరాల పంటలైన పెసర, మినుము వేసుకున్న రైతులు పొలాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వాణిజ్య పంటలైన మొక్కజొన్న, ఇతర పంటలు వేసుకున్న రైతులు కూడా అప్రమత్తం కావాలన్నారు.

350 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జెమ్స్ వైద్యుడు

ఆమదాలవలస: మండలంలోని వంజంగిలో ఆమదాలవలస జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 350 మందికి రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయం, జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది, పీఆర్ఓ జి.త్రినాథరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: గ్రామాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మడపాం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ సమస్యలు ఉంటే దరఖాసు చేయాలని రైతులకు సూచించారు. వచ్చిన ప్రతీ దరఖాస్తుకు రసీదు చ్చి వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. పరిష్కారం కాలేదనే సమస్య దరఖాస్తుదారుల నుంచి రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనురాధ, తహసీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌ఫ్రెడ్ నోబుల్‌కు ఘనంగా నివాళులు

పాతపట్నం: ప్రపంచ ప్రఖ్యాత రసాయన శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబుల్ శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. పాఠశాలలో ఆల్‌ఫ్రెడ్ నోబుల్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆల్‌ఫ్రెడ్ నోబుల్ చిత్రపటానికి హెచ్ఎం, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు తారకరామారావు నివాళులర్పించారు. ఈయన పేరుపై నోబుల్ బహుమతులు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: మండలంలోని కాగువాడ వద్ద మద్యం అక్రమంగా రవాణా చేస్తుండగా ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్ఐ బి.లావణ్య మంగళవారం తెలిపారు. కాగువాడకు చెందిన వ్యక్తి వద్ద 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

మొక్కజొన్న.. లాభాలు మిన్న



మొక్కజొన్న పంట

- 110 రోజుల్లో పంట చేతికి..
- ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి
- సాగు చేసేందుకు రైతుల ఆసక్తి

సరుబుజ్జిలి: వాణిజ్య పంటల వలన లాభాలు ఆర్జిస్తున్న రైతులు రబీ సీజన్‌లో కూడా మొక్కజొన్న పంటపై ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఖరీఫ్‌లో వరి సాగు చేసిన తరువాత రబీ సీజన్‌కు విరామం ప్రకటించేవారు. ప్రస్తుతం సాగులో మెలకువలు, రైతు సేవా కేంద్రాలు అందుబాటులో ఉండడం వలన రైతులు అధికంగా సాగు విస్తీర్ణం పెంచారు. ఈ ఏడాదికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 3,918 ఎకరాల్లో రబీ సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఆరుతడి పంటతోపాటు తక్కువ పెట్టుబడి కావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

సాగు చేసే విధానం..

- రబీలో ఎక్కువగా సాగుచేసే పంట: మొక్కజొన్న
- పంట కాలం: 110 రోజులు
- రబీలో సాగు చేసే రకం: అడ్వాంటా
- విత్తనాల మధ్య వ్యత్యాసం: 20 మీటర్లు పొడవు, 60 సెంటీ మీటర్లు వెడల్పు
- ఎకరా సాగులో వచ్చే దిగుబడి: 20 నుంచి 30 క్వింటాళ్లు
- ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటా ధర: రూ.1,850
- మొక్కజొన్న కిలో విత్తనాలు: రూ.300
- ఎకరా సాగు అయ్యే ఖర్చు: రూ.2 వేలు
- సస్యరక్షణ నిమిత్తం అయ్యే ఖర్చు: రూ.2,500
- ఎకరా దుక్కికి అయ్యే ఖర్చు: రూ.3వేలు
- విత్తనాలు జల్లేందుకు ఖర్చు రూ. 2 వేలు
- నూర్పిడికి అయ్యే ఖర్చు: రూ.3 వేలు
- ఎకరా సాగులో మొత్తంగా అయ్యే ఖర్చు: 12,800

తక్కువ ఖర్చు



మొక్కజొన్న సాగు చేయడం వలన వరి కంటే అధిక లాభాలు వస్తాయి. ప్రతిఏటా మొక్కజొన్న సాగు చేయడం వలన ఆశించిన ఫలితాలు వస్తున్నాయి. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు మేరకు సాగు చేస్తున్నాం.

– ఎస్.కోటేశ్వరరావు, రైతు, కొండవలస, సరుబుజ్జిలి మండలం

సూచనలిస్తున్నాం



మొక్కజొన్న పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పిస్తుంది. దీనివలన అధికంగా రైతులు రెండు సీజన్లలో సాగుచేసి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుతున్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు కావాల్సిన పూర్తి సాగు సమాచారం అందిస్తున్నాం.

– బి.పద్మనాభం, వ్యవసాయాధికారి, సరుబుజ్జిలి

ఆమదాలవలసలో మొక్కజొన్న సాగు (ఎకరాల్లో) వివరాలు ఇలా..				
మండలం	సరుబుజ్జిలి	బూర్జ	ఆమదాలవలస	పొందూరు
మొక్కజొన్న	880	867	937	1234

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దాం



అభినందన సభలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, చిత్రంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణ

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పనిచేస్తున్నానని, తనమీదున్న నమ్మకంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన రాష్ట్ర స్థాయి పదవిని బాధ్యతగా నిర్వర్తిస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కిల్లి వెంకట సత్యనారాయణ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో మంగళవారం నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో వైఎస్సార్ సీపీని మరింతగా అభివృద్ధి చేద్దామన్నారు. తనకు పదవి రావడంలో సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలు గాలికొదిలేసి ప్రశ్నించేవారిపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేంటి? ప్రస్తుతం చేస్తున్న పాలనేంటని ప్రశ్నించారు. పరిపాలించడం చేతకాక అర్హులైనవారి పెన్షన్లు, సంక్షేమ పథకాలు తీసేసి మంత్రి అచ్చెన్న, ఆయన అనుచరులు ఆనందం పొందుతున్నారన్నారు. ఇలాంటి పాలన అందిస్తే ప్రజలు హర్షించరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మాట్లాడుతూ చిరుద్యోగులపై టీడీపీ నేతలు ప్రతాపం చూపిస్తున్నారన్నారు. అందరం కలిసి నియోజకవర్గ సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఏ పథకం ఇచ్చినా చంద్రబాబు ఏడుస్తూ ఇస్తారన్నారు. త్వరలో జమిలి ఎన్నికలు వస్తాయని, మీలా మేం చేస్తే పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు హితవు పలికారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, మాజీ డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, అంబటి శ్రీనివాసరావు, బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, ఎన్ని ధనుంజయరావు, గేదెల పురుషోత్తం, కె.వి.వి.సత్యనారాయణ, కోట గోవిందరావు, రఘురాం, పీస గోపి, సనపల నారాయణరావు, పిన్నింటి సాయి, బూర్లె శ్రీనివాసరావు, చింతు రామారావు, సరుబుజ్జిలి మండల నాయకులు, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, లావేటి అనిల్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రవణ, పైడి నర్సింహ అప్పారావు, ఆమదాలవలస మండల పార్టీ కన్వీనర్ తమ్మినేని శ్రీరామ్మూర్తి, బూర్జ మండల నాయకులు కర్నేన నాగేశ్వరరావు, పొందూరు జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పప్పల రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం



పాతపట్నం మండలంలోని బైదలాపురం పీహెచ్‌సీలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు మాట్లాడుతూ.. గర్భకోశంపై కావాల్సినంత జీవనాడుల ఒత్తిడి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ఎం.రాజులమ్మ, ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు, పీహెచ్ఎన్ లింగమూర్తి, ఈఓ కె.సూర్యకాంతం, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. – పాతపట్నం

మురుగులో తాగునీటి బోరు



ఎల్.ఎన్.పేట మండలంలోని బొరమాంబాపురం ప్రధాన వీధిలో మురుగులోనే తాగునీటి బోరు ఉంది. మురుగు నీరు వెళ్లే డ్రైనేజీ లేకపోవటం వలన బోరు వద్ద వాడిక చేసిన నీరు అక్కడే నిలిచి ఉంటుంది. ఈ బోరు నీటిని గ్రామస్తులు అన్ని అవసరాలకు వినియోగిస్తున్నారు. బోరు చుట్టూ ఉన్న మురుగునీరు వెళ్లేందుకు వీలుగా కాలువ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – ఎల్.ఎన్.పేట

శిథిలావస్థ



మెళియాపుట్టి మండలంలోని గొప్పిలిలో 1994లో నిర్మించిన మంచినీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉంది. గ్రామ పంచాయితీ దీనిని వినియోగించడంలేదు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.22 లక్షలతో నిర్మాణం చేపట్టిన ట్యాంక్ ద్వారా గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వాహనాలు నిత్యం రాకపోకలు కొనసాగించే రహదారి పక్కనే పాత ట్యాంక్ ఉండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి పోలాకి సుదర్శనరావును వివరణ కోరగా.. త్వరలోనే దీన్ని కూల్చివేస్తామని తెలిపారు. – మెళియాపుట్టి

వినతి



కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు నవంబర్ వేతనాల్లో కోతవేసిన మొత్తాన్ని చెల్లించాలని ప్రాజెక్టు స్థాయి కమిటీ ప్రతినిధులు అనురాధ, కె.లక్ష్మి, హేమలత కూటమి ప్రభుత్వాన్ని కోరారు. కొత్తూరు సీడీపీఓ విమలకుమారికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కూరగాయల బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. గొట్టిపల్లి, కుద్దిగాం కార్యకర్తల వేతనాలను చెల్లించాలని కోరారు. సీఐటీయూ నాయకులు సిర్ల ప్రసాదరావు, శ్రీలత, శాంతి, రాధారాణి పాల్గొన్నారు. – కొత్తూరు

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



నరసన్నపేట: మాట్లాడుతున్న జడ్జి హరిప్రియ



కొత్తూరు: అవగాహన కల్పిస్తున్న జడ్జి రాణి

నరసన్నపేట: మానవ హక్కులను రక్షించడం అందరి బాధ్యత అని నరసన్నపేట సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ అన్నారు. ప్రధానంగా న్యాయవాదులు మానవ హక్కుల పరిరక్షణలో మరింత బాధ్యతగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మానవ హక్కుల దినం సందర్భంగా న్యాయవాదులు, కక్షిదారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వ్యక్తి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మానవ హక్కులు మన రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ ఉన్నాయన్నారు. అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యత ఉందన్నారు. దీనిని గుర్తించి మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామన్నారు. వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా న్యాయవాదులు చూడాలన్నారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అందరూ సమానమే..

నరసన్నపేట: సమాజంలో స్త్రీలూ, పురుషులూ సమానమేనని, స్త్రీల పట్ల వివక్షత సరికాదని, వారి హక్కులను కాలరాయకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. స్థానిక డిగ్రీ/పీజీ కళాశాలలో మహిళా సాధికారిత సెల్ ఆధ్వర్యంలో పిల్లలు, స్త్రీలు పట్ల వివక్ష-మనవ హక్కుల సాధనలో భారత రాజ్యాంగం పాత్ర అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ లింగ వివక్షను విడనాడాలన్నారు. అధ్యాపకులు పూజా భరద్వాజ్ మాట్లాడుతూ బాలికలు, స్త్రీలకు గౌరవంగా కల్పించే సంస్కృతి ఇంటినుంచే మొదలు కావాలన్నారు. అనంతరం విద్యార్థులు నరసన్నపేట టౌన్‌లో ర్యాలీ చేపట్టారు. పంచాయతీ కార్యాలయం కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు.

చట్టాలపై అవగాహన అవసరం..

కొత్తూరు: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కందికట్ల రాణి అన్నారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జడ్జి మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ప్రభుత్వాలు తీసుకువచ్చిన ప్రతీ చట్టాన్ని తెలుసుకోవాలన్నారు. ఉచిత న్యాయ సలహాలు ఎలా పొందాలో వివరించారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరరావు, కొత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, ఏజీపీ రాడ రాజు, పోలీసులు పాల్గొన్నారు.



నరసన్నపేట: మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

భూ సమస్యలు పరిష్కరించాలి



సారవకోట: తహసీల్దార్‌కు దరఖాస్తులు అందజేస్తున్న రైతులు



కొత్తూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సూర్యనారాయణ, తదితరులు



మెళియాపుట్టి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సారవకోట: మండలంలోని పెద్దలంబ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ విజయలక్ష్మికి గ్రామానికి చెందిన రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 22 రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు అందించారు. 7 మ్యూటేషన్లు, భూ వివరణ మార్పు కోసం 7, ఎఫ్ లైన్‌కి 3, కొత్త పాస్ పుస్తకాల మంజూరు చేయాలని 4 దరఖాస్తులను అందజేశారు. మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అడంగల్‌లో తప్పులు సరిచేయాలి

కొత్తూరు: అడంగల్, 1-బీ రికార్డుల్లో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయాలని తహసీల్దార్ రవిచంద్రకు కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఒంద్రుజోల సర్పంచ్ గందవరపు ఈశ్వరి, నాగేంద్రతోపాటు పలువురు వినతిపత్రం అందజేశారు. ఒంద్రుజోలలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అడంగల్‌లో సర్వే నంబర్ 50 నుంచి 120 వరకు బంజరు మెట్టు అంటూ తప్పుగా నమోదు చేశారని సూర్యనారాయణ అన్నారు. పలువురు తమపేరుపై ఉన్న భూములకు మ్యుటేషన్‌లు పూర్తిచేయాలని కోరారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, గ్రామ సర్వేయర్, వీఆర్వో నారాయణరావు పాల్గొన్నారు.

భూమి ఒకరిది.. పేరు మరొకరిది..

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు.కె పంచాయతీ పరిధిలోని మురికింటి భద్రగ్రామానికి చెందిన రైతులకు దీర్ఘకాలంగా ఉన్న సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా సమాయ కార్యదర్శి లండ వెంకటరావు అధికారులను కోరారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పాపారావుకు రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు. వెంకటరావు మాట్లాడుతూ.. గత మూడు తరాలుగా 100 ఏళ్లకు పైబడి భూములు సాగు చేస్తున్నా.. భూమి మాత్రం వారి పైరున లేదని వాపోయారు. 2012లో అప్పటి ప్రభుత్వం రైతులకు సాగు హక్కులు ఉన్నట్లు రాసినా.. భూ రికార్డుల్లో పేర్లు నమోదు కాలేదన్నారు. 9, 11, 12, 13, 14, 23, 24, 25, 31 సర్వే నంబర్లలో ఉన్నభూమి రికార్డుల్లో వేరే వ్యక్తుల పేర్లపై ఉన్నాయన్నారు. సాగుచేస్తున్న రైతు పేరుతో పట్టాలను అందించి న్యాయం చేయాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

పొందూరు: రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు కోరారు. స్థానిక నెహ్రూ పార్కు ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 163-1 సర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. సీతమ్మ చెరువు నుంచి చాకలి కోనేరుకు బట్టి ద్వారా నీరు అందుతుందని, ఈ చెరువు కింద 40 ఎకరాలు సాగవుతుందన్నారు. అక్రమ నిర్మాణాలు జరపడంతో నీటిప్రవాహం నిలిచిపోయిందన్నారు. తక్షణమే అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరారు. ఈఓ మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సహకరించండి



జలుమూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు



సారవకోట: మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

సారవకోట: ఈ నెల 14న జరగనున్న నీటి సంఘాల ఎన్నికలు పక్కాగా జరిగేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమించిన ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 12 నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ ఎన్నికల నిర్వాహణకు మండల స్థాయి అధికారులతోపాటు సచివాలయ సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, వంశధార నీటిపారుదల శాఖాధికారి యలమంచిలి అనిల్‌కుమార్ ఉన్నారు.

పక్కాగా నీటి సంఘాల ఎన్నికలు

జలుమూరు: మండల పరిధిలోని నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆరు మేజర్, ఆరు మైనర్ నీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఇందులో మేజర్ సంఘానికి 12 టీసీలు, మైనర్‌కు ఆరు టీసీలు ఉన్నాయన్నారు. 14 ఉదయం టీసీల ఎన్నిక, మధ్యాహ్నం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని డీఈఈ బగ్గు సత్యనారాయణ వివరించారు. ఏకగ్రీవమైన వాటికి మినహాయించి, మిగిలిన సంఘాలకు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు ఉంటాయన్నారు. జేఈఈలు కిరణ్, భాను, ఎం.శ్రీనివాసరావు, కె.ధనుంజయ, ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన కల్పించాలి

- లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్



మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్

నరసన్నపేట: పంటల బీమా విధానం మారిందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించే బాధ్యత బ్యాంకర్లదేనని లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నియోజకవర్గంలోని బ్యాంకర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు, వెలుగు సీసీలతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులతో పంటల బీమా చేయించాలని, లోన్ తీసుకున్న ప్రతి ఒక్కరితో బీమా కట్టించాలన్నారు. పంటకు నష్టం జరిగి బీమా రాకపోతే బ్యాంక్ సిబ్బందినే నిందిస్తారన్నారు. క్రాప్ రుణాలు ఇవ్వలేదని కొలు రైతుల నుంచి ఫిర్యాదులు రాకూడదన్నారు. బ్యాంక్ పాస్ బుక్స్ ప్రింటింగ్‌పై పలు బ్యాంకులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని, ఇది తగదని అన్నారు. దీని కోసం తగిన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాబార్డ్ జిల్లా మేనేజర్ రమేష్ కృష్ణ, ఏఓ కె.సునీత, చిరంజీవి, కొంక్యాన సురేష్, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆందోళన



నరసన్నపేట సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

నరసన్నపేట: ఫెంగల్ తుఫాన్‌కు రైతులు బాగా నష్టపోయారు. ఈ నష్టం నుంచి తేరుకోక ముందే మళ్లీ గురువారం నుంచి వర్షాలు పడతాయని వాతావరణశాఖ నిపుణులు హెచ్చరిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఫెంగల్ తుఫాన్‌కు ధాన్యం తడిచి మొలకలు వచ్చాయి. ఈ ధాన్యం అమ్మకానికి మిల్లులకు ఇస్తే ససేమిరా అనడంతో మిల్లర్లు అడిగిన మేరకు ధాన్యం అదనంగా ఇస్తున్నారు. పలుచోట్ల ధాన్యం రోడ్లపై ఆరబోశారు. వాటిపై టార్పాలిన్లు కప్పి ఉంచారు.